క్లుప్తంగా

సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

డెప్యూటీ డీఈఓ కుమార్



ఆటోనగర్(విజయవాడతూర్పు):సెలవు దినాల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డెప్యూటీ డీఈఓ కేవీఎస్ కుమార్ హెచ్చరించారు. గురువారం బక్రీద్ పండుగ రోజున పటమటలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో తరగతులు నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వస్తున్నారన్న సమాచారంతో విద్యార్థులను పంపించారు. ఉపాధ్యాయులను డెప్యూటీ డీఈఓ కుమార్ ప్రశ్నించారు. అకడమిక్ ఇయర్ ప్రారంభమై 20 రోజులు కాకముందే క్లాసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. మరలా ఇలాంటి సమస్య ఉత్పన్నమైయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సెలవుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూలుకు పంపించడం నేరమన్నారు. సెలవుల్లో ప్రశాంతంగా ఇంటి వద్ద ఉండే విధంగా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ):భవానీపురం పరిధిలోని 11 కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వెంకటేష్ ఫౌండ్రీ రోడ్, హైవే రోడ్ వెంకటేష్ ఫౌండ్రీ, దర్గా ఏరియా, అవుట్ ఏజన్సీ ఏరియా, మీరా సాహెబ్ వీధి ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

హక్కులపై మహిళలకు అవగాహన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):అజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 'నిర్భయ్ భారత్– సశక్తి నారీ' అనే అంశంపై విజయవాడ రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైల్వే హాస్పటల్ సీఎమ్ఎస్ డాక్టర్ ఎం.శౌరిబాల పాల్గొని మహిళ ఆరోగ్యం, పోషకాహారం, విద్య, బాలల హక్కులు, మహిళా హక్కులు, సాధికారిత అనే అంశాలపై మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబతో పాటు సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. దైనందిన జీవితంలో మహిళలు రోజు తీసుకునే ఆహారంతో పాటు అదనంగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మహిళ ఆరోగ్యం, మహిళా హక్కులు, సాధికారతపై అవగాహన కల్పించేందుకు ఇప్పటికే హాస్పటల్ సిబ్బంది అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఏసీఎమ్ఎస్ డాక్టర్ ఎమ్.జైదీప్, డాక్టర్ సీతారాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన లాప్‌టాప్ అందజేత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆటోలో మర్చిపోయిన లాప్‌టాప్‌ను గంట వ్యవధిలో ఫిర్యాదుదారునికి వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి అందించారు. నలందడిగ్రీ కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చదువుతున్న మానేపల్లి భాగ్యతేజ్ తన ఇంటి నుంచి గురువారం కళాశాలకు బయలుదేరాడు. ఆ క్రమంలో ఆటోలో కాళేశ్వరరావు మార్కెట్ వద్ద వేరే ఆటో ఎక్కాడు. ఆ క్రమంలో ఆటోలో తన బ్యాగ్‌ను మరిచిపోయాడు.

దాంతో వెంటనే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చి సుమారు రూ.80 వేల విలువైన లాప్‌టాప్‌ను మర్చిపోయినట్లు ఫిర్యాదు చేశాడు. దానిపై పోలీసులు వారు ప్రత్యేకంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిశీలించారు. దాంతో ఆ ఆటోను గుర్తించి లాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను గుర్తించారు. అనంతరం దానిని భాగ్యతేజ్‌కు అందించారు. దాంతో ఆ కుటుంబం పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు



చిట్టినగర్ ఈద్గా గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో మత పెద్ద నజీర్ అహ్మద్ ప్రసంగం



ఈద్గా వద్ద నమాజ్‌లో ముస్లింలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):త్యాగానికి, దాన గుణాలకు ప్రతీక బక్రీదని చిట్టినగర్ మోతీ మసీద్ ఇమామ్ నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని గురువారం చిట్టినగర్ మోతీ మసీదు ఈద్గాలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. వన్‌టౌన్, సింగ్‌నగర్, పూర్ణానందపేట, విద్యాధరపురం, గొల్లపూడి, వైఎస్సార్ కాలనీ నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరయ్యారు. తొలుత బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఇమామ్ నజీర్ అహ్మద్ సందేశాన్ని అందించారు. దానం, సాయం, త్యాగం వంటి సుగుణాలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని చెప్పేదే బక్రీదన్నారు. ముస్లింలకు పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఈద్ ముబారక్ తెలిపారు. ఈద్గాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నమాజు అనంతరం కేటీ రోడ్డులో ట్రాఫిక్‌కు ఎటువంటి అవాంతరాలు కలుగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్. గౌస్‌మొహిద్దీన్, ఈద్గా మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖాజా, షేక్. ఇషాక్ ఆలీ, హమీద్ బేగ్, మౌలాలీలతో పాటు బాషా, చిచ్చా బ్రదర్స్ పెద్దలు పాల్గొన్నారు.

అందరికీ మేలు జరగాలని.....

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):త్యాగానికి, తోటి మానవుల ఆకలిదప్పులు తీర్చేందుకు ఏ త్యాగానికైనా వెనుకాడవద్దని ఇస్లాం బోధిస్తుందని పలువురు మత గురువులు పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. వన్‌టౌన్‌లోని గాంధీజీ నగర పాలక సంస్థ హైస్కూల్ ప్రాంగణంలో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అక్కడకు చేరుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పర్వదినం తరువాత అంత పెద్ద పండుగ బక్రీద్ అన్నారు. బక్రీద్ పర్వదినం అందరికీ మేలు చేయాలని ఆకాంక్షించారు. అలాగే వించిపేటలోని షాహీ మసీదులో ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం ఏడున్నర, ఎనిమిదిన్నర గంటలకు వేరువేరుగా నమాజ్‌లు ఏర్పాటు చేశారు. ఆ ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఏ త్యాగానికైనా వెనుకాడవద్దని ఇస్లాం చెబుతుందన్నారు. బక్రీద్ వంటి పర్వదినాల స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకోవాలని సూచించారు. అలాగే ఆయా ప్రార్థనల్లో మత గురువులు మాట్లాడుతూ భగవంతుడు ప్రసాదించిన జీవితాన్ని తిరిగి ఆయనకు సమర్పించేందుకు సిద్ధపడాలని బక్రీద్ వివరిస్తుందన్నారు. భగవంతుని కృపను అందించేందుకు ఆయన పక్షాన వచ్చిన ప్రవక్త సృష్టికి ఈ సందేశాన్ని అందించారన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, అర్షద్, ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజీద్‌ఖాన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మొహమూద్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వించిపేట మసీదు వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న షేక్ ఆసిఫ్, కార్పొరేటర్ అర్షద్



నైజాంగేటుసెంటర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న గౌస్‌మొహిద్దీన్



మసీదు వద్ద బక్రీద్ శుభాకాంక్షలు చెప్పకుంటున్న చిన్నారులు

మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు....

వించిపేట(విజయవాడపశ్చిమ):పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ గురువారం నగరంలోని పలు మసీదులను సందర్శించి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు వించిపేట నైజాంగేటుసెంటర్‌లోని మొహమ్మదీయ మసీదును సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వం బక్రీద్ నమాజు కోసం అన్ని మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని తెలిపారు. జిల్లాలో కూడా చక్కటి వాతావరణంలో నమాజు జరిగిందన్నారు. స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముస్లింలు అధికంగా నివసించే పశ్చిమ నియోజకవర్గంలోని గాంధీజీ హైస్కూల్, కుమ్మరిపాలెం, చిట్టినగర్ ఈద్గాల్లో అన్ని సదుపాయాలతో ప్రత్యేక ప్రార్థనలు జరిగినట్లు తెలిపారు. ముస్లిం పెద్దలు పఠాన్ ఇమామ్ ఖాన్, షేక్ బాజీ షహీద్, ఎండి ఇక్బాల్, ఎండి షరీఫుద్దిన్, అన్సారీ బేగ్, ఎండి ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి పూజల్లో ఎమ్మెల్యే వెలంపల్లి



వెలంపల్లికి ప్రసాదాలు అందిస్తున్న మందిర పాలకమండలి సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):గురుపౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పాత హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణిమ ద్వాదశ సప్తాహ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు గురువారం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి సాయినాధునితోపాటు వారి భక్తులకు విశేష సేవలు అందిస్తున్న మందిర పాలకమండలి సభ్యులను వెలంపల్లి శ్రీనివాసరావు అభినందించారు. ముఖ్యంగా సాయిబాబాకు భక్తుల తోనే అభిషేకాలు, సహస్రనామార్చన చేసే అవకాశం కల్పించటం హర్షణీయమన్నారు. సప్తాహ వేడుకల్లో భాగంగా ఉదయం 6గంటలకు బాబా విగ్రహాన్ని పంచగంగలతో అభిషేకించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో సహస్రనామార్చన గావించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 'ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి'అనే అఖండ సాయినామ సంకీర్తనతో భక్తులు పరవశించిపోయారు.

ప్రత్యేక అలంకరణలో ఉన్న సాయిబాబాకు మధ్యాహ్నం పంచహారతులు ఇచ్చిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. శుక్రవారం స్వామివారిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించనున్నామని, అనంతరం ప్రతి రోజూ మాదిరిగానే భక్తులు సాయిబాబాను పుష్పాలతో సహస్రనామార్చన చేస్తారని మందిరం పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు తెలిపారు. పాలకమండలి ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పోతార్లంక రజనీకాంత్, గురజపల్లి వెంకట కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు నిర్వహించారు.

ఘనంగా తొలి ఏకాదశి పర్వదినం



శ్రీకృష్ణ భగవానుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



డీసీపీ వెంకటరత్నం దంపతులకు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు



వెంకన్న ఉత్సవమూర్తులకు కోటి తులసీదళార్చన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తొలి ఏకాదశి పర్వదినాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వన్‌టౌన్‌లోని వైష్ణావాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారికి కోటి తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల నామార్చనలు, అర్చకుల వేద పఠనాల మధ్య కార్యక్రమం జరిపించారు. అంతరాలయంలో మూలమూర్తికి ప్రత్యేక అలంకారం చేశారు. అర్చకులు పొన్నంగిపల్లి దీక్షిత్, పరాశరం బాల ముకుందాచార్యులు, ఈవో హరిగోపీనాథ్‌బాబు పాల్గొన్నారు. భావనారాయణవీధిలో కొలువై ఉన్న కోదండరామస్వామి దేవస్థానంలో స్వామికి పూలంగిసేవ చేశారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు టీవీ రాఘవేంద్రదీక్షితులు నిర్వహించారు. శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీకృష్ణార్జునల వారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలో 18 అధ్యాయాల గీతాపారాయణ జరిపించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి అభిషేకాలు చేశారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో వేంచేసి ఉన్న కోదండరామస్వామి వారి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. మూలమూర్తులకు తిరుమంజనం చేశారు. పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు వైదిక కార్యక్రమాలు పర్యవేక్షించారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):తొలి ఏకాదశిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి తులసీదళ అర్చన నిర్వహించారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన కళ్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు పూజలు నిర్వహించిన అనంతరం ఉభయదాతలు, భక్తులచే సామూహికంగా తులసీ దళ అర్చన నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారి మూలవిరాట్‌ను దర్శించుకుని గోత్ర నామాలతో పూజలు జరిపించుకోగా, వారికి పేలాల పిండి ప్రసాదాన్ని అర్చకులు అందచేశారు. నగర డీసీపీ(క్రైం) పల్లా వెంకటరత్నం, శ్రీనివాసరావు దంపతులు గురువారం స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి విచ్చేసిన డీసీపీ వెంకటరత్నం దంపతులను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావులతో పాటు కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అందచేయగా, ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి చిత్రపటం అందచేశారు. కమిటీ కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, కామందుల నరసింహారావు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



స్వామికి తులసీదళ అర్చన



అయ్యప్ప స్వామి వారికి విశేష అలంకరణ

అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):తొలి ఏకాదశిని పురస్కరించుకుని కొత్తపేట వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలోని అయ్యప్ప స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ అనంతరం పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి వారికి పంచ హారతుల సేవ నిర్వహించారు.

నేత్రపర్వంగా పాండురంగడి కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్త గుళ్ళు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి శాంతి కల్యాణోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజాము నుంచి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలమూర్తులకు పంచామృత తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫలపుష్పసుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అలాగే ఆలయంలో కొలువై ఉన్న సంతాన వేణుగోపాలస్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి వారి తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహాసంకల్పం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, మంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర ఘట్టాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవ విశిష్టతను అర్చకస్వాములు భక్తులకు వివరించారు. పండరీపురంలో జరిగే రీతిన నగరంలో కూడా స్వామి వారి కల్యాణోత్సవం, అర్చనలను నిర్వహించడం అపూర్వమని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయదాతలు తదితరులు పాల్గొన్నారు.



పాండురంగడి కల్యాణోత్సవం

భార్యపై భర్త హత్యాయత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యపై భర్త హత్యాయత్నం చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వించిపేట అబ్దుల్ రజాక్ వీధికి చెందిన భౌరిశెట్టి దుర్గ, శివకుమార్‌లది ప్రేమ వివాహం. శివకుమార్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. గత కొంత కాలంగా భార్యభర్తల మధ్య విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో శివకుమార్ తండ్రి మరణించడంతో పెద్దకర్మకు వచ్చాడు. ఆ సమయంలో శివకుమార్ భార్యను ఇష్టం వచ్చినట్లు మాట్లాడమే కాకుండా ఇంట్లో నిద్రిస్తున్న తరుణంలో ముఖంపై దిండు వేసి నొక్కడంతో కేకలు వేసింది. గురువారం చాకుతో ఎడమ చేతిపై మణికట్టుపై గాయపరచగా, బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

పశ్చిమ జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం పశ్చిమ నియోజకవర్గ జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమించింది. ఈ మేరకు గురువారం వారి పేర్లను ప్రకటించింది. నియోజకవర్గంలోని సీ1 మండల విభాగానికి చెందిన 37, 38, 51, 52, 53, 54, 55, 56 డివిజన్లకు కేసరి కృష్ణారెడ్డిని నియమించారు. అలాగే సీ2 మండల విభాగానికి చెందిన 34, 35, 46, 47, 48, 49, 50 డివిజన్లకు వడ్డూరి యశోదర్‌ను నియమించారు. అదేవిధంగా సీ3 మండల విభాగానికి చెందిన 39, 40, 41, 42, 43, 44, 45 డివిజన్లకు సయ్యద్ అతీక్‌ను నియమించారు.

గణాంకశాస్త్రంతో దేశాభివృద్ధి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):గణాంకశాస్త్రం ద్వారా దేశాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు చేయవచ్చని నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఫీల్డ్ ఆపరేషన్ డివిజన్) ఆర్ కిరణ్‌కుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, నేషనల్ స్టాటిస్టికల్ కార్యాలయం ఆధ్వర్యంలో జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా గణాంక శాస్త్ర ప్రాముఖ్యతపై సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆర్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాజ వికాసానికి, అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయటానికి గణాంకాలు చాలా అవససరమన్నారు. గణాంక శాస్త్ర నిపుణులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు గణాంకశాస్త్రంలో నైపుణ్యాలను సాధించాలన్నారు. ఈ రంగానికి సంబంధించిన నిపుణుల కొరత ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. ఈ శాస్త్రంలో పట్టు సాధించటం ద్వారా అద్భుతమైన అవకాశాలను పొందవచ్చని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో వివిధ అంశాలపై నిర్వహించిన పలు పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కిరణ్‌కుమార్

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై అంతర్గత బదిలీలు జరిగాయి. ఏఈవో స్థాయి నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు సుమారు వంద మందిని ఏకకాలంలో బదిలీ చేస్తూ ఈవో భ్రమరాంబ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ అంతర్గత బదిలీలు జరిగినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అధికారులను అంతర్గత బదిలీ చేస్తూ జారీ చేసిన సర్క్యులర్‌లోనే ఆయా అధికారులు ఏ తేదీన బదిలీ అవుతారో తెలియజేయడం గమనార్హం. మరో వైపున ఈ బదిలీలు ప్రతి మూడు నెలలకు ఒక సారి తప్పని సరిగా జరుగుతాయని అంటున్నారు.